# శివుడు

"వచ్చేటప్పుడు శివుడు కొట్లో కాఫీపొడి కొని పట్టుకురండి" భర్తను ఆదేశించిందో ఇల్లాలు.

"ఈ సరుకులు ఇక్కడున్నట్లుగా పట్టించుకు రావాలి" కిట్టయ్యకు చీటీ ఇచ్చి శివుడు కొట్టుకు పంపించాడు టీ కొట్టు తాతయ్య.

"ఆ చెక్క తర్వాత చిత్రిక పడుదువు గాని ముందు శివుడు కొట్టుకెళ్ళి అగ్గిపెట్టె, బీడికట్ట పట్టుకురా" పని కుర్రాడికి డబ్బులిచ్చాడు చిన్నారావు.

శివుడు... శివుడు... శివుడు...

అంతా శివనామస్మరణ చేస్తున్నారు. ఆ ఊళ్ళో ఉన్నది శివుడి కొట్టేనా? ఎందుకంతా ఆ కొట్టుకే ఎగబడుతున్నారు? శివుడు వికలాంగుడన్న సానుభూతి. కాదు సరసమైన ధరలకు సరుకులిస్తాడన్న నమ్మకం, ఏది ఏమైతేనేం అతడి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా పరిఢవిల్లుతోంది.

దండిగా డబ్బులొస్తున్నా శివుడికి దర్పం లేదు.

అందుకే అతడంటే అంతా ఇష్టపడతారు. "శివయ్యా!" పలకరించాడు టైలరు రామస్వామి.

"ఎలాగుంది పండుగ హడావుడి?" నవ్వుతూ అడిగాడు శివుడు.

"పండగా! పాడా?'... ఊళ్ళో దర్జీలెక్కువైపోయారు. ఎవరికీ సరిగ్గా పనుల్లేవు, ఈ గాడిదైనా సదూకుని బాగుపడతాడేమో అనుకుంటే బడికెళ్ళడానికి మొరాయిస్తున్నాడు."

"ఏరా బడి మానేసి ఏం చేద్దామనుకుంటున్నావ్?" రాంబాబును దగ్గరకు

పిలిచాడు శివుడు.

"ఏ పనైనా చేస్తాను."

"బడిలో భూతాలున్నాయేంట్రా బెదిరిపోతన్నావ్?" కొడుకును కసురుకున్నాడు రామస్వామి.

"పిశాచాలు కూడా ఉన్నాయి పీక్కుతింటానికి" మాటకు మాట బదులిచ్చాడు రాంబాబు.

"చూశావా అది పొగరు"

"నువ్వుండు రామస్వామి"

"నువ్వెన్ని సెప్పు ఆడు సదివేది ఉత్తిమాట. ఈంలైతే నాకో ఉపకారం సేసిపెట్టు సచ్చి నీ కడుపున పుడతాను".

ఏమిటన్నట్లు చూశాడు శివుడు. "అదివరకు నువ్వేదో ఫ్యాక్టరీలో పన్జేసేవాడివే అంటలో ఈడికేదైనా పనిప్పించి పున్నెం గట్టుకో, ఆడల్లరి రోజు రోజుకూ ఎక్కువై పోతుంది. ఇంటికాడ నేను ఈడమ్మా ఈడితో యాగలేక ఛస్తున్నాం."

"వద్దు రామస్వామి. ఆ మాట మాత్రం అనకు, చదువుకునే వయసులో ఈ పసివాళ్ళ్ని ఫ్యాక్టరీకి పంపి ఆడిభవిష్యత్తు నాశనం చెయ్యకు. గానుగులా పన్జేయడం తప్ప ఆడక్కడ టాపుకునేదేం ఉండదు."

శివుడి మాటల్లో ఆవేదన ఉంది. చూపుల్లో అభ్యర్ధన గోచరిస్తోంది.

మాట్లాడలేదు రామస్వామి. "నేను వాడికి నచ్చచెబుతా. నువ్వెళ్ళు." వెళ్ళిపోయాడు రామస్వామి.

రాంబాబుని కూర్చోమని చెప్పి వాడి దోసిట్లో సెనక్కాయలు పోశాడు శివుడు.

ఒక్కొక్క కాయ వలుచుకు తింటున్నాడు రాంబాబు.

"నాకూ బొటనవేలుంటే నీలాగే కాయలు వలుచుకుతినేవాణ్ణి" అన్నాడు శివుడు.

"నీ బొటన వేలుకేమైంది?" అడిగాడు రాంబాబు.

"చిన్నప్పుడు ఫ్యాక్టరీలో పనిచేసేటప్పుడు నాచేతి మీద సుత్తి దెబ్బ పడింది నరాలు తెగిన బాధతో గిలగిలలలాడిపోయాను."

సెనక్కాయలు తినడం మానేసి శివుడి వంక గుడ్లప్పగించి చూశాడు రాంబాబు.

వాడి ఆసక్తిని గమనించి "వింటానంటే చెప్తా నా చరిత్రంతా చెబుతాను" అన్నాడు శివుడు. వినడానికి ఉద్యుక్తుడయ్యాడు రాంబాబు చెవులురిక్కించి.

......

"ఈయాల శివుడు పుట్టాడు." అంది లక్ష్మి.

"ఆ సంగతి తెలుసులే. ముందాడికి కొత్త బట్టలుతొడిగి బడికి పంపు" అన్నాడు రాజయ్య.

"ఈ పూటైనా ఇంటికాడ ఉండు మావా. కలిసి కూడుతిందాం" బ్రతిమలాంది లక్ష్మి.

"నాకూ ఉండాలనే ఉంది లచ్చి. అయినా ఈలుకాదు. మా మేస్త్రీ ఈ మధ్య నా మీద గుర్రుగా ఉన్నాడు. పన్లోకి పోకుంటే నా మీద ఏం సాడీలు సెబుతాడో ఏటో."

మగడి నిస్సహాయతకు నిట్టూర్చించి లక్ష్మి.

"మన శివుడు పాయసం అంటే పడిచస్తాడు. వండిపెట్టు."

"అట్టాగేలే. నువ్వు మాత్రం ఈపొద్దు బేగిరా" శాసిస్తున్నట్లంది లక్ష్మి.

తల ఊపాడు రాజయ్య.

పెనిమిటి పన్లోకి పోగానే బిడ్డకు తలంటి కొత్త బట్టలు తొడిగింది. పుస్తకాల సంచిచ్చి మురిపెంగా బడికి సాగనంపింది.

శివుడు బడిలో పంతుళ్ళకు, పిల్లలకు బిళ్ళలు పంచాడు.

జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారంతా.

అయ్య ఈపాటికి ఇంటికొచ్చేస్తుంటాడు. తన కొత్త బట్టలు చూస్తే ఎంతగా మురిసిపోతాడో? అమ్మ పాయసం వండి తనకోసం ఎదురుచూస్తూ ఉంటుంది త్వరగా ఇంటికెళ్ళాలని ఉంది శివుడికి. గంట కొట్టారు గభాలు లేచాడు పరుగు పెట్టాడు. ఇంటి ముందు గుమిగూడిన జనాన్ని చూశాడు.



అందర్నీ తోసుకుంటూ లోపలికెళ్ళాడు. ఊహించని దృశ్యం కంటబడడంతో షాక్ తిన్నట్లైపోయాడు.

వరండా మీద రాజయ్య మృత దేహం గుర్తుపటలేనంతగా వుంది. అతడి ప్రక్కన జుట్టు విరబోసుకుని శోకదేవతలా ఏడుస్తూ కూర్చుంది లక్ష్మి.

"గనిలో పన్జేసేటప్పుడు రాజయ్య మీద బండరాయి పడిందట" అన్నారెవరో.

శివుడికి ఎనిమిదేండ్లు నిండిన తరుణంలో పండుగజేసుకోవాలనుకున్నాడు రాజయ్య. అయితే ఆ రోజే తనకు నూరేళ్ళ పండగ జరుగుతుందని తెలియదతడికి.

బిడ్డను చూసి బావురుమంది లక్ష్మి. శివుణ్ణి గుండెలకదుముకుని గుండెలవిసేలా ఏడ్చింది.

"నాన్నా!" అంటూ కన్నీరు మున్నీరుగా విలపించాడు శివుడు.

ఆ తల్లీ తనయుల్ని ఓదార్చే శక్తి ఎవరిలోనూ లేదక్కడ.

రాజయ్య మరణంతో లక్ష్మి బ్రతుకు ప్రశార్థకమైంది. బతకడంకోసం నాలుగిళ్ళలో పాచిపనికి కుదురుకుంది.

శివుడు చదువుమానేసి తల్లికి అండగా ఉండాలనుకున్నాడు. అందుకు అంగీకరించలేదామె. బిడ్డ బాగుకోసం తనెంతైనా కష్టపడాలనుకుంది. అయితే ఆదిలోనే ఆమె ప్రయత్నానికి భగవంతుడు అడ్డుపుల్ల వేశాడు, మూడు నెలలు తిరక్కుండానే ఆమెను మాయరోగం ఆవరించింది. వైద్యానికి డబ్బు లేకపోవడంతో అశ్రద్ధ చేసింది. ఫలితంగా భర్తననుసరించింది.

దిక్కులేని వాడయ్యాడు శివుడు.

రాజయ్యతో సన్నిహితంగా మెలిగే నర్సింహులు శివుణ్ణి ఫ్యాక్టరీకి తీసుకెళ్ళాడు.

అతని స్థితికి జాలిపడింది ఫ్యాక్టరీ యాజమాన్యం. బాల కార్మికుడిగా పలకల ఫ్యాక్టరీలో అడుగు పెట్టాడు శివుడు. తనలాగే అక్కడెందరో పసివాళ్ళు పని చేస్తూన్నారు. కొంత మంది పలకలకు మేకులు కొడుతున్నారు. మరి కొందరు వాటికి మెరుగులు దిద్దుతున్నారు. పలకల కర్మాగారాల్లో పిల్లల్ని ఎక్కువగా మేకులు కొట్టడానికి, మెరుగులు దిద్దడానికి వినియోగిస్తారు. ఆ పనికి పిల్లల వేళ్ళు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. పైగా పని వేగంగా అయిపోతుంది.

ఫ్యాక్టరీలో ఎవరు ఏ పని చెప్పినా శ్రద్ధగా చేస్తున్నాడు శివుడు. పట్టుకొచ్చిన ప్రతి పైసా నర్సింహులుకు ఇస్తున్నాడు. అతని భార్య శివుణ్ణి కన్న బిడ్డకంటే ఎంతో మిన్నగా చూసుకోవడంతో తను అనాధనన్న భావన అతడి మనమసులోంచి తొలగిపోయింది. ఏ ఒడిదుడుకులు లేకుండా మూడు నాలుగేళ్ళు కాల గర్భంలో కలిసిపోయాయి.

అన్ని రోజులూ ఒకే మాదిరిగా ఉంటాయని అనుకోవద్దు అంది కాలం. ఎప్పటిలాగే ఆ రోజు కూడా శివుడు మేకులు పట్టుకుంటే మరో వ్యక్తి సుత్తితో కొడుతున్నాడు. పొరపాటున అతడి చేయి జారింది. సుత్తి శివుడి చేతి మీద పడింది. బాధతో గిలగిల్లాడిపోయాడు శివుడు. బొటన వ్రేలు తెగడంతో రక్తం

ధారకట్టింది. చేస్తున్న పనులు వదిలేసి కార్మికులంతా. అతడి చుట్టూ చేరారు. కట్టు కట్టి ఇంటికి పంపించారు.

వెంటనే నర్సింహులు శివుణ్ణి డాక్టరుకు చూపించి వైద్యం చేయించాడు. నెల రోజులకు గాయం మానింది. మళ్ళీ పని చేసేందుకు ఫ్యాక్టరీకెళ్ళాడు శివుడు.

"మొండి చేత్తో నువ్వేం పని చేస్తావ్ వెళ్ళు" అంది ఫ్యాక్టరీ యాజమాన్యం.

ఆ మాటతో దుఃఖం ముంచుకొచ్చింది శివుడికి. భవిష్యత్తు అంధకారంగా తోచింది. ఏ పని చేయకుండా ఎలా బతకాలో బోధపడడంలే. ఇన్నాళ్ళూ బాబాయి తనను కంటికి రెప్పలా చూసుకున్నాడు. నెల రోజులు మంచం మెక్కినా పోషించాడు.పైగా తన గాయానికి డబ్బు మంచినీళ్ళలా ఖర్చు చేశాడు. ఇంకా తను వాళ్ళకు భారం కాకూడదనుకున్నాడు. పని కోసం ఊరంతా తిరిగాడు. ఆకలేస్తే పంపు నీటితో కడుపు నింపుకున్నాడు. అలసటైతే చెట్ల నీడను ఆశ్రయించాడు. రెండ్రోజులు గడిచాయి.

ఆకలితో పేగులు లుంగలు చుట్టుకుపోతున్నాయి. ఆలోచనలో పడ్డాడు శివుడు.

తనిప్పుడు ఇంటికి వెళితే నర్సింహులు బాబాయి ఆదరించి అన్నం పెడతాడు. తన ఆకలి తీరుస్తాడు. ప్రాణం నిలబెడతాడు. అయినా ఇంటికి వెళ్ళాలని అనిపించడంలేదు. ఆకలి దప్పులతో తను అంతమైపోయినా ఫరవాలేదు. బాబాయికి మాత్రం భారం కాకూడదనుకున్నాడు. కళ్ళు తిరిగి నట్టైంది. గభాలున నేలకొరిగి పోయాడు.

"బాబూ!" మూత పడిపోతున్న రెప్పల్ని అతి కష్టంమీద విప్పాడు.

నర్సింహులు బాబాయి.

"నీ కోసం మొన్నటి నుండి వెతుకుతున్నాను. ఇంటికి రా బాబు"

అస్పష్టంగా వినిపిస్తున్నాయి అతడి మాటలు, ఏదో చెప్పాలనుకున్నాడు శివుడు. కాని గొంతు విడడంలేదు. మెల్లగా వాడిని రెండు చేతులతో ఎత్తుకుని ఇంటికి తీసుకువెళ్ళాడు నర్సింహులు.

పాల గ్లాసు శివుడి నోటికందించింది నర్సింహులు భార్య సత్యవతి. కళ్ళు తెరిచాడు శివుడు. వంట్లో కాస్త శక్తి వచ్చినట్లుగానే లేచి నిలబడ్డాడు.

"నువ్వెందుకు ఇంటికి రాకూడదనుకుంటున్నావో నాకు తెలుసు బాబు. ఎవ్వరూ నీకు పని ఇవ్వనక్కర్లేదు. ఈ పదివేలు తీసుకుని ఏదైనా వ్యాపారం చేసుకుని స్వతంత్రంగా బ్రతుకు"అన్నాడు నర్సింహులు.

మాట్లాడలేదు శివుడు.

అతడి అంతర్యాన్ని గ్రహించిన నర్సింహులు "తీసుకోబాబు. సంకోచించకు. ఇది నీ డబ్బే. నువ్వు దాచుకున్నడబ్బు. ఇన్నాళ్ళూ నీ సంపాదనలో నెల నెలా రెండొందలు బ్యాంకులో వేశాను. అదిప్పుడు వడ్డీతో ఇంతైంది" అన్నాడు అనునయంగా.

శివుడు కళ్ళకు నర్సింహులు బాబాయి దేవుడిలాగా కనిపించాడు.

"అలా ప్రారంభించిన అతి చిన్న వ్యాపారం అంచలంచెలుగా ఎదిగి నేడింతగా విస్తరించింది. అందుకు బాబాయి ఆశీసులు, నా స్వయం కృషే కారణం." అంటూ తన గుండె చప్పుడు వినిపించాడు శివుడు.

"నేను ఫ్యాక్టరీకి పోను. చదువుకుంటాను" అంటూ దిగ్గున లేచి పరుగెత్తాడు రాంబాబు.

( 5 జనవరి 2003 ఆంధ్రప్రభ డైలి )